ఆప్తులెవరు?

శ్రీమతి వి. వినత

★

రమ ఒక సామాన్య కుటుంబీకుని కుమార్తె. తండ్రి శంకరంగారికి. రమ, సుందర్ తప్ప మరెవ్వరు లేరు. రమ అల్లారు ముద్దుగా పెరిగింది. ఆమె చిన్నతనములో ఏదో వీధిబడిలో చదువుకున్నది. తండ్రి పూర్వాచారపరాయణుడగుటచేత, అభము, శుభము తెలియని రమకు ఆరవ యేటనే వైభవముగా వివాహముచేశారు. రమకు నెమ్మదిగా స్వేచ్ఛ నసించింది.

ఇల్లే స్వర్గమయింది. చదువుకూడా మాని పించారు

ఆమె పదునాల్గవయేటనే అత్తవారింటికి కాపరానికి వెళ్లింది. కాపరానికి వెళ్లిన రెండేళ్లలోనే 'శశి' పుట్టింది. కాని పాపం 'రమ' పచ్చగా పాతికేళ్లపాటైనా పసుపు కుంకుమ పెట్టుకునేందుకు నోచుకోలేదు. శశికి యేడాది తిరుగకముందే భర్త మరణించాడు! శంకరంగారు, రమను, శశిని యింటికితీసుకువచ్చారు. అసలేగంపెడు దుఃఖముతోవున్న రమకు గోరుచుట్టు మీద రోకటి పోటయినట్లు తండ్రికూడా మరణించాడు.

రమకు యిప్పుడు అన్నగారి వద్దనే ఆశ్రయము. రమ వెళ్లిన కొత్తల్లో తన అన్నగారు, వదినెగారు యెంతో ప్రేమతో చూచేవారు. ఒకరోజున సాయంకాలము శశి, తన మామయ్య కూతురైన బుజ్జితో ఆడుకుంటోంది. యేదో చిన్న పోట్లాటవచ్చి, శశిని బుజ్జి పడత్రోసి లోపలవున్న తల్లి దగ్గరకు వెళ్లి 'అమ్మా' నన్నుశశి కొట్టిందే అని యేడవసాగింది. ఆమె గబగబావంట చేస్తున్న రమదగ్గరకువెళ్లి, "యేమి సోద్యమమ్మా నీ ముద్దుల కూతురు నాచిట్టి తల్లిని యెట్లా కొట్టిందో చూడు" అని యింకా యేదో చెప్పబోతూవుండగా, శశిచెంప మీదనుండి కారుతూన్న నెత్తురును తుడుస్తూ, "పాపము బుజ్జిని కొట్టావుటగా, తప్పుగాదూ? అసలు జరిగిన దేమిటో చెప్పు" అన్నది. "నేను బొమ్మను పెట్టి ఆడుకుంటూ వుంటే బుజ్జి నా బొమ్మనుకావాలాన్నది. నా బొమ్మను నాకు యిమ్మని చేతో పట్టుకున్నాను. తన బొమ్మట-తనకు కావాలిట, అని ఒక త్రోపుత్రోసి లోపలికి వచ్చేసింది" అంటూ బావురమని యేడ్చింది శశి. "లేదే అమ్మా బొమ్మను తీసుకోబోయి కాలుజారిపడ్డది" అన్నది బుజ్జి. "యేమిటో నమ్మా లేనిపోని గొడవ నేలది తీసుకునెత్తికి రాచుకున్నారు మీ అన్నయ్య" అన్నది విసుగుతో వదినెగారు. రమ యేమీ మాట్లాడకుండాయింట్లోకి పోయింది. రాను రాను యింటిలోని పని బండెడుచాకిరీ రమ మీదపడ్డది. యెంత చేసినా వెనకనుంచి వదినెగారు సాధిస్తూనే యుండేది. రమ దేనికీకూడా యెదురు తిరిగి సమాధానము చెప్పేదికాదు. ప్రతిరోజూ యేదో ఒకచిన్న పోట్లాటలేనిదే రోజు గడిచేదికాదు. ఒక్కొక్కసారి అకారణంగా అన్నగారు కూడా రమమీద విసుక్కొనేవాడు.

ఒక రోజు సాయంకాలము బుజ్జికి మామిడిపిందెల జరీపరికిణీ, జాకెట్టుతొడిగి వసారాలో జడవేస్తోంది వదినెగారు. శశి, బుజ్జి బట్టలుచూచి పరుగున రమవద్దకువచ్చి అటువంటి పరికిణీ చొక్కా యీయమే అన్నది. వినీవిననట్లు వూరుకొన్నది రమ. తిరిగి 'యీయమ్మా' అన్నట్లుమారాం పెట్టింది

శశి. 'నీవు కట్టుకున్నవి బాగున్నాయి; అట్లా యేడుస్తారా!' అన్నది రమ యేడుస్తున్న శశిని వోదారుస్తూ. 'కాదు యివి చినిగాయి, అటువంటివే కావాలి' అని యేడుస్తోంది శశి. ఇంతట్లో వసారాలోంచి బుజ్జి "చూచావుటే అమ్మా, నేనేమో మంచి బట్టలు కట్టుకున్నానని, యేమిటో తిడుతూ మెటికలు విరుస్తోంది అత్తయ్య," అన్నది. వదినెగారు అందుకుని, "నీకు యేమిపోయే కాలంవచ్చిందే - నా కూతురు బాగుంటే చూడలేవుటే. యెవరైనా కాస్తమంచి బట్టలు కట్టుకుంటే చూచి వోర్వలేవు" అని యేమో అంటోంది. రమవచ్చి "లేదు వదినా!, నేను యేమీ అనలేదు. శశివచ్చి బట్టలు యిమ్మని యేడుస్తూవుంటే దాన్ని వోదారుస్తున్నాగాని, బుజ్జిని యేమీ అన లేదు" అన్నది. "చాల్లేవే అమ్మా! నీ మాయమాటలు - యిన్నాళ్లు యేపోరు లేకుండా హాయిగా వున్నాము" అంటూ వుండగా, అప్పుడే లోపలకువస్తున్న అన్న గారు - కోపంగా "ఎప్పుడూ వెధవగొడవ యేదో! యిట్లా పోట్లాడేటట్లయితే నా యింటిలో వుండనక్కరలేదు, తక్షణంలేచి పో" అన్నాడు రమను - భార్య ప్రోద్బలం అయితేనేమి, యింక దేనివల్లనయితేనేమి. యివన్నీ వింటూవున్న రమకు కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. తన అసమర్థతకు తన్ను తాను నిందించుకొంది. తనకేమీ చేయాలో తోచలేదు. తన భర్తవుంటే యిలాటివి అన్నీ యెందుకు వచ్చేవి? మనస్సులో యేదో రైళ్లు పరుగెత్తసాగాయి. రమకు ఆరోజు రాత్రి అన్నము సయించలేదు. పక్కమీద పడుకున్నదన్నమాటేగాని నిద్రపట్టలేదు. ఆమెలో యేదో ఆలోచనలు-తను యెక్కడకు వెళ్లుతుంది? తన అన్నగారు తప్ప దిక్కెవ్వరు? యేనుయ్యో చూచుకొందామనుకొంది. కాని తనశశి ...మనస్సులో యేదో చివుక్కుమన్నది. ఆమె యెక్కడకైనా వెడదామంటే చేతిలో చిల్లిగవ్వలేదు. పూర్వము తనతండ్రి పెళ్లికి పెట్టిన రెండు జతలగాజులు చేతికివున్నాయి.

ఆమెకు రానురాను ఇంట్లో వుండటము దుర్భరముగానున్నది. ఒకనాటి రాత్రి గట్టిగా ఆలోచించింది రమ. ఆ నాడు నిద్రపట్టలేదు. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. గంటమూడు కొట్టింది. తను యెచ్చటకో వెడదామని-యెక్కడికి తన ప్రయాణము? ఎక్కడికో తనకే తెలియదు. యేదో తప్పుచేస్తున్నటుగా తోస్తోంది. బుజ్జి దీపము మినుకు, మినుకుమంటోంది. నిద్రపోతున్న శశిని యెత్తుకుని మెల్లిగా వాకిట్లోకివచ్చింది, కాని కాళ్లుముందుకు సాగనీయుటములేదు. తలుపు మెల్లిగా తెరచి వారవాకిలిగావేసి స్టేషనుకు బయలు దేరివెళ్లింది. వారికోసం యెదురుచూస్తున్నట్లు రైలు సమయానికి వచ్చింది.

మద్రాసు వెళ్లేది కాబోలు! రమ దాంట్లో యెక్కింది. రైలు వేగంగా వెళ్లుతోంది. యెక్కడికి వెళ్లటము? వెళ్లి యెక్కడ వుండటము?-ఆలోచనలో పడ్డదిరమ. శశి నిద్రనుంచి లేచి "అమ్మా! యెక్కడికే వెడుతున్నది. మామయ్య అత్తయ్యా వాళ్లు యేరి" అన్నది. రమకు యేమి చెప్పాలో తెలియలేదు. "ఇది యెక్కడకు తీసుకువెళ్లితే అక్కడకు" అన్నది.

ఉదయం ఆరుగంటలకు ట్రయిను మద్రాసు చేరుకొంది. కూలీ,కూలీ అంటూ కూలీలు రైలుచుట్టూ మూగారు. రమ, శశి, ట్రయిను దిగారు. తిన్నగా బయటకు వచ్చారు. ఎండ తీవ్రముగా వుండుటవల్ల కాబోలు శశి ఆకలికి యేడ్చింది. అక్కడ అరటిపళ్లు, మామిడిపళ్లు కొని పెట్టింది రమ. ప్రక్కనుంచి రిక్షావాడు 'ఎంగే పోగణుం! యిదిలో యేరమ్మా' అన్నాడు. రమకు అరవం అర్థముకాదు. ట్రాములు, ఆటోరిక్షాలు - ఒకటేమిటి అన్నీ కొత్తగావున్నాయి. అట్లా నడిచే పోతున్నారు. త్రోవలో ఒక స్త్రీ వారిని చూచి "ఎవరమ్మా! మీరు? యెక్కడకి వెళ్లాలి" అన్నది. "ఎక్కడికీలేదు" అన్నది రమ. "నీ పేరు యేమిటమ్మా? నిన్ను యెక్కడో చూచినట్లువున్నది. మీ ఈ దీనస్తితి చూస్తూవుంటే జాలివేస్తూ యున్నది. తల్లీ, తండ్రీలేరా" అన్నది ఆమె. రమ, "ఈ అభాగ్యురాలి వునికి దేనికమ్మా" అంటూ వుండగా, కళ్ల వెంట నీళ్లు బొటబొట కారాయి. ఆమె "తిరిగి చెప్పమ్మా! చెప్పు" అన్నది. "నా తండ్రి చిన్నతనములోనే నాకు వివాహము చేశాడు. కాపరానికివెళ్లిన రెండు యేళ్లకు శశిపుట్టింది. ఇది పుట్టిన యేడాదికే నా భర్త మరణించారు. తరువాత మా నాన్నదగ్గరకు వచ్చాను. నాఖర్మ- అక్కడకు వెళ్ళిన కొన్నాళ్లకే నాన్నకూడా తనువు చాలించారు" అంటూ వుండగా, ఆ యువతి అందుకుని "యేదో చిన్నతనము జ్ఞాపకము వస్తున్నది. అచ్చము నీలాగే వుండేది ఆ అమ్మాయి! ఆ అమ్మాయి నేనూ యెంతో స్నేహముగా వుండే వాళ్లము. తరువాత నాచదువునుగూర్చి ఈ వూళ్లో కాపరం పెట్టారు మానాన్న. నీవు చెపుతూవుంటే అంతా యేమిటోలాగున్నది, నీపేరు యేమిటోచెప్పు" అన్నది. "నాపేరు రమ" అనబోతూవుంటే, "రమ...నీవే ఆ..."అని కౌగలించుకొంది ఆమె. "ఈ దరిద్రురాలు ఇంకా జ్ఞాపకము వుందా! అబ్బా యెన్నాళ్లకు నిన్ను చూడ కలిగాను" అన్నది రమ. కారులోంచి పిల్లవాడు హారనుచేశాడు. ముగ్గురుయింటికి కారులో వెళ్లారు. రమ ఇప్పుడు ఎమ్.బి.బి.ఎస్.చదివి స్వంతంగా వైద్యశాల పెట్టింది. మంచిప్రాక్టీసు. శశిని దగ్గరవున్న అనాధశరణాలయంలోచేర్చి, తను రోగులకు సేవచేస్తూ అచ్చటే వుండి పోయింది రమ.